క్లుప్తంగా

మరిడమ్మ జాతర మహోత్సవాలు



సీతారామపురంలో మరిడమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ దేవత మరిడమ్మ వారి జాతర మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు కందికొండ వెంకటకృష్ణయ్య, భాస్కరశర్మ, రవి తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాంతిహోమం జరిపారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, పంచామృతాభిషేకం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు



డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీలో ఎస్ఐ రవీంద్రబాబు, సర్పంచ్, గ్రామస్తులు

ఐ.పోలవరం: మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని ముమ్మిడివరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ కుమార్ అన్నారు. గుత్తెనదీవి గ్రామంలో డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐ.పోలవరం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవి మునిరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మోహన్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ మత్తులో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. గుత్తెనదీవి సొసైటీ అధ్యక్షుడు చిక్కాల శ్రీను, గంగాబత్తుల విష్ణుచక్రం, పడాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



కనకాలపేటలో పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ అంకిత్‌కుమార్

యానాం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఇక వేగవంతం కానున్నాయని, గతంలో కల్పించిన అడ్డంకులు తొలగిపోయాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శనివారం వివిధ గ్రామాల్లో సుమారు రూ.1.6 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఐఏఎస్ అధికారి, ఆర్ఏఓ అంకిత్‌కుమార్‌తో కలసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత ఆర్ఏఓ అంకిత్‌కుమార్ చొరవతో ఏళ్లుగా ప్రారంభం కాకుండా ఉన్న పనులు తిరిగి మొదలుకావడం ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా ఎస్సీలకు సంబంధించి ఆదిద్రావిడ సంక్షేమ శాఖ నిధులు ద్వారా పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మెట్టకూరు, కనకాలపేట, గణపతి నగర్, గోపాల్‌నగర్, గిరియాంపేట గ్రామాల్లో పనులకు శ్రీకారం చుట్టారు. ఈఈ కాళ్ల నాగరాజు, జేఈలు జ్యోతిరాజు, కుమార్, లక్ష్మి, ఆదిబాబు, చెల్లి గోపి, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం..

ముమ్మిడివరం: విద్యాశక్తి కార్యక్రమాన్ని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దడం సరికాదని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్ మునేశ్వరరావు, యు.వెంకట్రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది బలవంతం కాదని చెబుతూనే హెచ్ఎంల ద్వారా ఉపాధ్యాయులను భయపెట్టి విద్యాశక్తి కార్యక్రమం నడిపించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే 10వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా 4 గంటల నుంచి 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఫ్యాప్టో పక్షాన డీఈఓకు విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని ముందుగానే వినతిపత్రం ఇచ్చామన్నారు.

ఘనంగా అన్న సమారాధన

యానాం: స్థానిక రామన్నకోడు గ్రామంలో గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు బైపాస్ జంక్షన్‌లో..

తాళ్లరేవు: సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో ఈ నెల 15న అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని వర్తక సంఘ అధ్యక్షుడు పుగాకు వాసు, ప్రతినిధులు కోరారు.

పల్లెలకు జ్వరమొచ్చింది

- పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- ఆసుపత్రుల పాలవుతున్న బాధితులు
- ఎక్కడికక్కడే పారిశుధ్య సమస్యలు



మురమళ్లలో పంట కాలువ చెంతనే పేరుకుపోయిన చెత్త



కేశనకుర్రు పీహెచ్‌సీలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఐ.పోలవరం: అడపాదడపా కురుస్తున్న వర్షాలు.. వేసవిని తలపించే వాతావరణంతో పల్లెలకు జ్వరం వచ్చింది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రజలు సీజన్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇందులో ఎక్కువ మంది జ్వర పీడితులే ఉండడం గమనార్హం. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సీజన్ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధానంగా తాగునీటిలో బ్యాక్టీరియా వృద్ధి చెందడమే కారణమని అంటున్నారు. రక్షిత మంచినీటి పథకాల నుంచి కూడా స్వచ్ఛమైన నీరు అందడం గగనంగా మారింది. దీనికితోడు గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త వ్యాధులు ప్రబలడానికి కారణమవుతోంది. రోడ్లు, పంట కాలువల వెంబడి చెత్త కనిపిస్తోంది. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర అంటూ కూటమి ప్రభుత్వం హడావుడి చేస్తోందే తప్ప.. పంచాయతీల్లో పారిశుధ్య పనులు అంతంత మాత్రంగానే నిర్వహిస్తుంది. దీనివల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. సీజన్ వ్యాధులు పెరగడంతో రెండు నియోజకవర్గాల పరిధిలో అమలాపురం ఏరియా ఆసుపత్రి, ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల వద్ద రోగులు బారులు తీరుతున్నారు. మరీ ముఖ్యంగా తీర ప్రాంత మండలాలైన ఉప్పలగుప్తం, అల్లవరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో వ్యాధుల తీవ్రత అధికంగా ఉంది. సాధారణ జ్వరాలతో పాటు మలేరియా, గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రస్తుతం వీటి బారిన పడుతున్న వారి సంఖ్య తక్కువగా ఉన్నా అశ్రద్ధ చేస్తే బాధితుల సంఖ్య పెరిగే అవకాశముంది.

జలం.. గరళం

మురమళ్లలోని పుష్కరాల రేవు సమీపంలో స్థానికులు చెత్త వేస్తున్నారు. దీనివల్ల కాలువ కలుషితం అవుతోంది. ఇక్కడ స్నానాలు చేయడానికి పిల్లలు, పెద్దలు వస్తున్నారు. ఆ నీటి కారణంగా జ్వరాలు, అంటువ్యాధుల పడుతున్నారు. ఎదుర్లంక, కొమరగిరి ప్రధాన పంట కాలువను ఆనుకుని ఉన్న షాపు యజమానులు సైతం చెత్తను కాలువలో పడేస్తున్నారు. అంతేకాకుండా సెప్టిక్ ట్యాంక్ కలుషితాలు ఈ కాలువలోకే వదులుతున్నారు. ఈ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముమ్మిడివరం, మురమళ్ల, కేశనకుర్రు, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం గ్రామాల్లోని సంత మార్కెట్‌లో వర్షాలు వచ్చినప్పుడు చెత్తను తొలగించకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవే రోగాలకు ఆస్కారంగా మారుతున్నాయి.

వైద్యాధికారులూ అప్రమత్తం

వ్యాధులు పెరుగుతుండడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటా సర్వే చేస్తున్నారు. జ్వరాల బారిన పడిన వారిని కలసి ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఈ సీజన్‌లో కలుషిత తాగునీటి కారణంగా డయేరియా, డీసెంట్రీ టైఫాయిడ్, కామెర్లు వంటివి వచ్చే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని చెబుతున్నారు.

చిన్నపిల్లల పట్ల శ్రద్ధ చూపాలి



సీజన్ వ్యాధులు ప్రబలుతున్నందున చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సాధారణ జ్వరం అని వదిలేయకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించాలి. వారికి చలి గాలి తగలకుండా చూడడంతో పాటు, కాచి చల్లార్చిన నీటిని అందించాలి.

– ఎంఎస్ రాజేష్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి, కేశనకుర్రు

సిద్ధార్థరెడ్డిని కలసిన వుంగరాల



సిద్ధార్థరెడ్డిని సత్కరించిన సంతోష్

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ శనివారం కలిశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ములాకత్‌లో కలిసేందుకు వచ్చిన సిద్ధార్థరెడ్డిని రాజానగరం నియోజకవర్గం గాడాల గ్రామంలో మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారని సంతోష్ తెలిపారు.

స్కూటీలో పాము

అమలాపురం టౌన్: స్థానిక బుచ్చెమ్మ అగ్రహారంలో స్కూటీపై వెళుతున్న చంద్రమౌళికి తాను ప్రయాణిస్తున్న వాహనంలో శనివారం ఉదయం పాము కనిపించడంతో కంగారు పడ్డారు. తక్షణమే స్కూటీకి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆయన కింద పడ్డారు. ఆ వెంటనే స్థానికులు ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు ఫోన్ చేసి రప్పించారు. ఆయన స్కూటీ ముందు భాగాన్ని తెరిచి చూసేసరికి అందులోని ఓ పాము పిల్లను బయటకు తీశారు. అది జెర్రి గొడ్డు పాము పిల్ల అని తెలిపారు.

29, 30న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

యానాం: స్థానిక రీజియన్‌లో స్పెషలిస్ట్ వైద్యులు, జీడీఎంఓఎస్ షార్ట్‌టెర్మ్ కాంట్రాక్టు పోస్టులకు వాక్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు శనివారం డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ ఓ ప్రకటనలో పేర్కొంది. 65 ఏళ్లు మించకుండా ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో యానాం ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయానికి ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

సేవలు అమూల్యం

యానాం: ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ దివ్యాంగుల పాఠశాల సేవలు అమూల్యమైనవని పలువురు అన్నారు. స్థానిక బీచ్ రహదారిలో సొసైటీ 38వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1988లో ఎస్వీ రెడ్డి ఆధ్వర్యంలో వికలాంగ పిల్లల కోసం రాయుడు పాలెంలో ఈ సంస్థను స్థాపించారన్నారు. యానాంలో 2011 నుంచి ప్రారంభించామన్నారు. పిల్లారాయ లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కోన దేవ, ఎస్.గోపీ శ్రీనివాస్, హరికృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

యానాం: స్థానికంగా ఓ యువతి అదృశ్యంపై శనివారం కేసు నమోదయ్యింది. ఆ వివరాల ప్రకారం .. పట్టణంలో కేవీఆర్ నగర్‌కు చెందిన బొమ్మిడి భవాని (18) ఈ నెల 12న అదృశ్యమైందని, కుటుంబ సభ్యులు అంతా గాలించినా ఆచూకీ తెలియక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పంపన మూర్తి తెలిపారు.

ఆధునిక నాటక యుగకర్త ఆత్రేయ



ఆత్రేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

అమలాపురం టౌన్: మనసు కవి ఆచార్య ఆత్రేయ సినీ గేయ రచయితగానే కాకుండా గొప్ప నాటక రచయితగా ఎన్నో ఆదర్శవంతమైన, స్ఫూర్తిదాయకమైన నాటికలు రాశారని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి అన్నారు. అందుకే ఆత్రేయ ఆధునిక నాటక యుగకర్త అయ్యారన్నారు. స్థానిక డాబా గార్డెన్స్‌లో శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆచార్య ఆత్రేయ వర్ధంతి సభలో కవి నరసింహమూర్తి మాట్లాడారు. తొలుత ఆత్రేయ చిత్రపటానికి కోనసీమ రచయితల సంఘ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవి నరసింహమూర్తి 'మనసు కవి మహా కవి ఆత్రేయ' అనే కవితను సభలో వినిపించారు. శ్రీశ్రీ కళావేదిక సహాయ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీపాద రామకృష్ణ, సాహితీ అభిమానులు కడలి సత్యనారాయణ, చిక్కాల రవిశంకర్, కోళ్ల పద్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల గృహ నిర్బంధం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులను కోరంగి పోలీసులు గృహ నిర్బంధం చేశారు. స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద ఓ స్థలం విషయంలో వివాదం రేగింది. దీనిపై ఇరుపక్షాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. కాగా మరిడమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా శనివారం ఆలయం చెంతన ఉన్న స్థలంలో అమ్మవారికి మొక్కుబడులు సమర్పించే కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పలువురిని బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సంగాని దాసు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సంగాని వీరనాగేశ్వరమ్మ, వారి కుమారుడు రాజేష్‌లను గృహ నిర్బంధం చేసినట్లు వారు విలేకర్లకు తెలిపారు. దాడి చేసిన, తమ ఆస్తులను ధ్వంసం చేసిన వారిని వదిలిపెట్టి తమను హౌస్ అరెస్ట్ చేయడం ఏంటని వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నించారు.

పలువురికి సీఐ కౌన్సెలింగ్



ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: పేరూరు వై.జంక్షన్ 216 జాతీయ రహదారిపై టాప్ లెస్ జీపు, మోటార్ సైకిళ్లపై డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా ఆపై ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రజలను బెంబేలెత్తించిన వారికి పట్టణ సీఐ పి.వీరబాబు శనివారం రాత్రి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే వారి తల్లిదండ్రులను పిలిపించి వారికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందులో ఏడుగురు మైనర్లు కావడంతో సీఐ వారికి పలు సూచనలు చేశారు. మీ అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంబంధం లేనివారు ఎందుకు బలి కావాలని అన్నారు. తండ్రులూ కాస్త ఆలోచించి పిల్లలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా సైక్లాథాన్



వై.జంక్షన్‌లో సైక్లాథాన్ ప్రారంభిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి

అమలాపురం రూరల్: అమలాపురం కామనగరువు పరంజ్యోతి స్కూల్ ఆధ్వర్యంలో వాక్‌థాన్ – సైక్లాథాన్‌ను శనివారం నిర్వహించారు. ఏడు కిలోమీటర్ల సైక్లాథాన్‌ను అమలాపురం పేరూరు వై.జంక్షన్ నుంచి జెండా ఊపి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. తొలిత గడియార స్తంభం సెంటర్‌లో ఐదు కిలోమీటర్ల వాక్‌థాన్‌ను ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విల్ఫ్రెడ్ నోరోన్హా మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అందరికీ నడక అవసరమన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరంజ్యోతి కార్యదర్శి కరస్పాండెంట్ కార్ల్ డేవిడ్ కోమనపల్లి, ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పీఈటీ శ్రీనివాస్, డాక్టర్ శివకుమార్ హాజరయ్యారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

అల్లవరం: దేవగుప్తం గ్రామానికి చెందిన బాలిక బాలవన్మరణానికి కారణమైన నిందితుడు పలివెల వెంకటేష్ (మున్నా)ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన మహిళా శక్తి కన్వీనర్ కొంకి రాజామణి డిమాండ్ చేశారు. దేవగుప్తంలో శనివారం బాలిక కుటుంబాన్ని పరామర్శించి నిజ నిర్ధారణ చేశారు. తన కుమార్తెకు నిందితుడు మాయ మాటలు చెప్పి లొంగదీసుకుని శరీరకంగా, మానసికంగా హింసలకు గురిచేశాడని బాలిక తల్లి తెలిపింది. తన కుమార్తెను బ్లాక్ మెయిల్ చేసి ప్రాణాలు తీసుకునే స్థాయికి వేధించాడని బాలిక తల్లి సంఘ సభ్యులకు చెప్పారు. ప్రభుత్వం బాలిక కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని సంఘ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భూపతి ప్రమీల, అంబటి లక్ష్మి, కడలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల కేటాయింపులో వివక్ష

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న 177 కనస్ట్రక్షన్ హెల్పర్ పోస్టులకు శుక్రవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో యానాం రీజియన్‌కు కేవలం 3 పోస్టులను కేటాయించడంపై శనివారం పలువురు నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తుంటే పుదుచ్చేరి ప్రభుత్వం మాత్రం యానాం రీజియన్‌పై వివక్ష ప్రదర్శిస్తుందని వారు వాపోయారు. పుదుచ్చేరి రీజియన్‌కు 141 పోస్టులు, కారైకల్‌కు 20, మాహే 13, యానాం 3 పోస్టులు కేటాయించారన్నారు. యానాం రీజియన్ జనాభా ప్రస్తుతం 70 వేలకు చేరుకుందని, అయినప్పటికి పోస్టుల సంఖ్య పెంచడం లేదన్నారు. ముఖ్యంగా జనరల్, ఎస్సీ, ఓబీసీ, ఎంబీసి తదితర కేటగిరీ వారు నష్టపోతున్నారన్నారు. దీనిపై మద్రాస్ హైకోర్టును ఆశ్రయిస్తామని వారు పేర్కొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ



ప్రజాసభకు హాజరైన వ్యాపారులు, ఆటోడ్రైవర్లు

యానాం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే మక్కల మండ్రం ప్రజాసభ ద్వారా యానాం పోలీస్ స్టేషన్‌లో వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమం సీఐ అడలరసన్, ఎస్సైలు శేరు నూకరాజు, పునీత్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగింది. వ్యాపారులు, ఆటోడ్రైవర్లు తదితరులు హాజరై తమ సమస్యలపై అర్జీలు అందించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని పోలీస్ అధికారులు తెలిపారు.

'దారి'లోకి తేవాలి




బైపాస్ రోడ్డుకు దగ్గర మార్గంగా ఉన్న పద్మినీపేట కాలువ రోడ్డు

అమలాపురం టౌన్: అమలాపురం నల్ల, ఎర్ర వంతెనల మధ్య ఉన్న బైపాస్ రోడ్డులో పద్మినిపేట నుంచి ఎస్పీ నాయుడు లే అవుట్ వరకూ ఉన్న పంట కాలువ రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. అటు ఎర్ర వంతెన రోడ్డుకు, ఇటు నల్ల వంతెన రోడ్డుకు దగ్గర దారి ఇది. అలాగే ఎస్పీ నాయుడు లే అవుట్ వద్ద ఉన్న మెట్ల కాలనీ, బాలయోగి కాలనీ ప్రజలకు ఇది ఎంతో ఉపయుక్తం. గతంలో గ్రావెల్ రోడ్డు వేశారు. ఇప్పుడు అధ్వాన స్థితిలో ఉండడంతో వాహనచోదకులే కాదు, కాలినడకకే నరకం చూస్తున్నారు. ఆ రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ కాలువ రోడ్డు మీదుగా ఎర్ర వంతెన వైపు నుంచి వచ్చే ప్రజలకు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు అతి దగ్గరగా ఉంటాయి. దాదాపు అర కిలో మీటరు ఉన్న ఈ కాలువ రోడ్డుతో అటు, ఇటు ఉన్న వ్యవసాయ భూముల రైతులు ఎక్కువగా రవాణా లబ్ధి పొందుతున్నారు. తమ వ్యవసాయ ఉత్పత్తులను ఇటుగా గమ్యస్థానాలకు చేర్చుకుంటారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో చాలామంది ఇటుగా రావడమే మానేశారు. వర్షం వస్తే మరింత ఇబ్బందిగా ఉంటుంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి రోడ్డును ఆధునీకరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుల ధ్రువీకరణ పత్రంలో ఇబ్బందుల తొలగింపు

అమలాపురం రూరల్: శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత, ఈడిగ గీత కులాల ధ్రువీకరణ పత్రం ముందు గౌడ నామకరణం ఉండడంతో ఆ ఇబ్బందులను తొలగిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని శెట్టిబలిజ సంఘ నాయకులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి తెలిపారు. పేరూరులో శనివారం శెట్టిబలిజ సంఘ పెద్దలతో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శెట్టిబలిజలను ఓసీ కేటగిరీలో చేరుస్తున్నా, అదే సామాజిక వర్గానికి చెందిన మంత్రి వాసంశెట్టి సుభాష్ పట్టించుకోవడం లేదని కొందరు విమర్శించడం సరికాదని అన్నారు. సమావేశంలో శెట్టిబలిజ సంఘ నాయకులు చొల్లంగి సాయిబాబు, వాసంశెట్టి చినబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి, ఇళ్ల రాము పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలి



రాజోలు బస్టాండ్ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాజోలు: విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి నిర్వహించాలని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో శనివారం రాజోలులో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు రాజోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద యూనియన్ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో విద్యుత్ బస్సులను ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తున్నాయన్నారు. బస్సుల కొనుగోలు ద్వారా వచ్చే సబ్సిడీ ప్రైవేటు వ్యక్తులకే పోతుందన్నారు. అలా కాకుండా ఆర్టీసీ విద్యుత్ బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తులు సంస్థలోకి చొరబడితే భవిష్యత్‌లో సంస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. దీనికి సంబంధించిన జీఓ 88ను తక్షణమే ఉపసంహరించాలని కోరారు. అధ్యక్షుడు నారాయణ, ఎస్‌కేవీ ఖలీల్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీలకు సాయిదుర్గ



అంబాజీపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు కె.కె.సాయిదుర్గ ఎంపికైనట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సాయిదుర్గను పలువురు శనివారం అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ, ఈ నెల 12న కాకినాడలో జరిగిన తైక్వాండో స్కూల్ గేమ్స్ అండర్–19 విభాగంలో సెలక్షన్స్ జరిగాయన్నారు. ఈ సెలక్షన్స్‌లో సాయిదుర్గ 55 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. త్వరలో రైల్వే కోడూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనుందన్నారు. కోచ్‌లు పితాని భార్గవి, రామచంద్ర, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు సాయిదుర్గను అభినందించారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడండి

సఖినేటిపల్లి: మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా రెవెన్యూ యంత్రాంగం చూడాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులు చెవ్వాకుల వెంకట్, ముత్యాల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం అంతర్వేదికర శివారు దిండకొడపలో సముద్రం అలలు సమీపంలో ఇసుక తవ్వకాలపై పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ, ఇసుకను తవ్వేసిన ప్రాంతాలను రెవెన్యూ యంత్రాంగం విచారణ చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధి హామీ పథకం నిధులతో ఉప్పునీరు గ్రామాల్లోకి పోటెత్తకుండా తీరంలో రక్షణ గట్లు అంతర్వేది దేవస్థానం నుంచి గొల్లపాలెం వరకూ వేశారన్నారు. కొంత మంది రక్షణ గట్ల పేరుతో సముద్రం అలలు వచ్చే చోట ఇసుకను తవ్వేసి అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఇటీవల అంతర్వేదికరలో తవ్వకాలపై రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్టుగా తమకు సమాచారం ఉందన్నారు.